సాక్షి మెదక్

ఆదివారం । 7 । సెప్టెంబర్ । 2025

చలో.. చూసొద్దాం రండి

సండే స్పెషల్

నగరాలతో పోటీ పడుతూ సంగారెడ్డి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోంది. చుట్టు పక్కల పర్యాటక ప్రాంతాలతో కలగలిసి సందర్శకులను ఆకట్టుకుంటూ పర్యాటక కేంద్రంగా అవతరించబోతున్నది. పచ్చని పంటలు, మంజీరా గలగలలు, పురాతన ఆలయాలు జిల్లాకే తలమానికంగా ఉన్న ఐఐటీ, మెడికల్ కళాశాల ఇలా ఎన్నో మణిహారాలతో రాష్ట్రంలోనే సంగారెడ్డి ప్రత్యేకత సంతరించుకుంది. జిల్లాలో పర్యాటక ప్రాంతాలపై ఈ వారం సండే కథనం. - సంగారెడ్డి టౌన్



8లో



శివ్వంపేట పీఏసీఎస్ వద్ద యూరియా కోసం రైతుల బారులు

అల్లాడుతున్న అన్నదాత

- యూరియా కోసం తప్పని గోస
- గంటల కొద్దీ నిరీక్షణ.. సరిపడా రాని స్టాక్
- నిరుత్సాహంతో వెనుదిరిగిన రైతులు

నర్సాపూర్/శివ్వంపేట(నర్సాపూర్): యూరియా కోసం రైతులు గోస పడుతున్నారు. నాలుగు రోజులుగా నర్సాపూర్‌లో యూరియా అందుబాటులో లేదు. శనివారం 8వందల బస్తాల యూరియా వస్తుందని తెలువడంతో వందల మంది రైతులు ఆయా గ్రామాల నుంచి పట్టణానికి వచ్చారు. స్థానిక రైతు వేదికలో గంటల తరబడి నిరీక్షించి టోకెన్లు తీసుకున్నారు. యూరియా అగ్రోస్‌లో విక్రయిస్తారని చెప్పడంతో అక్కడ కూడా నిరీక్షించారు. కాగా అగ్రోస్ వెనుక గల్లీలో లారీ నిలిపి యూరియా బస్తాలను అందజేశారు.

యూరియా కోసం బారులు

శనివారం తెల్లవారు జాము నుండి మండలంలోని వివిధ గ్రామాల రైతులు శివ్వంపేటలోని పీఏసీఎస్ కేంద్రానికి తరలివచ్చారు. 10 గంటల అనంతరం 450 బస్తాల యూరియా రావడంతో పంపిణీ చేసినప్పటికి పూర్తి స్థాయిలో సరిపోక పోలేదు. దీంతో రైతులు నిరుత్సాహంతో వెనుదిరిగారు.



నర్సాపూర్ రైతు వేదికలో యూరియా టోకెన్ల కోసం ఎగబడిన రైతులు

న్యూస్‌రీల్

నేడు దుర్గమ్మ దర్శనం నిలిపివేత

పాపన్నపేట(మెదక్): సంపూర్ణ చంద్రగ్రహణాన్ని పురస్కరించుకొని ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి వన దుర్గమ్మ దర్శనాన్ని నిలిపి వేస్తామని ఈఓ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి 12 గంటల వరకు రాజగోపురంలో పూజలు. దర్శనం కొనసాగుతాయని పేర్కొన్నారు. సోమవారం సంప్రోక్షణ అనంతరం ఉదయం.5.30 గంటల నుంచి తిరిగి అమ్మవారి దర్శనం ప్రారంభమవుతుందని చెప్పారు. మంజీర వరదల వల్ల దుర్గమ్మ రాజగోపురం వద్ద పూజలు జరుగుతున్న విషయం విదితమే.

వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలి

డీఎంహెచ్‌ఓ శ్రీరామ్



రోగులతో మాట్లాడుతున్న శ్రీరామ్

హవేళీఘణాపూర్(మెదక్): ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధి సర్ధన పీహెచ్‌సీని సందర్శించి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్నందున ప్రజలు రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవసరమైన గ్రామాల్లో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య సేవలందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. అనంతరం సర్ధన బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. డీఎంహెచ్‌ఓ వెంట నారాయణ, హరిప్రసాద్, నవ్య, మండల వైద్యాధికారి వినయ్, సిబ్బంది ఉన్నారు.

కార్మికుల హక్కులను కాల రాస్తున్న కేంద్రం

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు



మాట్లాడుతున్న చుక్క రాములు

మెదక్ కలెక్టరేట్: పెట్టుబడి దారుల కోసం కార్మికుల హక్కులను కేంద్రం కాలరాస్తుందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు ఆరోపించారు. శనివారం సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు బాలమణి అధ్యక్షతన జరిగిన జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగా అమలు చేస్తున్న లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా ఉద్యమం చేస్తామన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను బీజేపీ ప్రభుత్వం తుంగలో తొక్కిందని ఆరోపించారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడంలేదన్నారు. అలాగే పరిశ్రమలలో కాంట్రాక్టు కార్మికులకు భద్రత లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వ సంస్థల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడం లేదన్నారు. జిల్లాలో మొదటి సారిగా సీఐటీయూ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్, ఆడివయ్య సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లేష్, జిల్లా ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి, కోశాధికారి నర్సమ్మ, బస్వరాజు, గౌరీ, నాగరాజు, నాగేందర్ రెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

సరిపడా యూరియా అందించండి

హుస్నాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు సరిపడా యూరియా అందించాలని గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పడిగ ఎర్రయ్య, ప్రధాన కార్యదర్శి గన్నెబోయిన వెంకటాద్రి డిమాండ్ చేశారు. శనివారం మాట్లాడుతూ రాష్ట్రంలో సహకార సంఘాల వద్ద రైతులు యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారని వాపోయారు. సకాలంలో యూరియా వేయకపోతే పంట దిగుబడి తగ్గి నష్టపోతారని, అవసరానికి తగ్గట్లుగా గోదాముల్లో యూరియా నిల్వ చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

జ్వరమొచ్చింది

- 20 డెంగీ, 84 టైఫాయిడ్ కేసుల నమోదు
- 18వేల పైచిలుకు వైరల్ బాధితులు
- జ్వరంతో ఇద్దరు విద్యార్థుల మృతి
- 10 మందిలో ఒక్కరిద్దరికి వైరల్ ఫీవర్

మెదక్‌జోన్: మెతుకు సీమ మెదక్ మంచం పట్టింది. జిల్లాలో వైరల్ ఫీవర్, టైఫాయిడ్, డెంగీ కేసులు విజృంభిస్తున్నాయి. ప్రతీ పదిమందిలో ఒక్కరిద్దరు చొప్పున వైరల్ జ్వరం బారిన పడుతున్నారు. ఇప్పటికే జిల్లాలో జ్వరం బారిన పడి ఇద్దరు విద్యార్థులు మృత్యువాత పడ్డారు. భారీవర్షాలు, వాతావరణ మార్పులు, అపరిశుభ్రత కారణంగా దోమలు పెరిగి వ్యాధులు వ్యాప్తి చేస్తున్నాయి.

కిక్కిరిసిన ఆస్పత్రులు

జిల్లా కేంద్ర ఆస్పత్రి, ఏరియా, కమ్యూనిటీ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతోపాటు ప్రైవేటు హాస్పిటళ్లు రోగులతో కిక్కిరిసిపోతున్నాయి. వర్షాకాలం ప్రారంభం నుంచి ఇప్పటివరకు 20 డెంగీ, 84 టైఫాయిడ్, 18,424 వైరల్ ఫీవర్ కేసులు జిల్లాలో నమోదయ్యాయి. ఒక్క ఆగస్టు నెలలోనే 5,904 ఫీవర్ కేసులు నమోదు కావడం జిల్లాలో ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. శివ్వంపేట మండలం తునికి గ్రామానికి చెందిన 10వ తరగతి విద్యార్థి సుమన్, 5వ తరగతి విద్యార్థి సుశాంక్ జ్వరంబారిన పడ్డారు. వీరిని వివిధ ఆస్పత్రుల్లో చేర్పించినప్పటికీ చికిత్స పొందుతూ మృతి చెందడమే ఇందుకు నిదర్శనం.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్లేట్‌లెట్ల దందా!

వైరల్ ఫీవర్‌తోపాటు టైఫాయిడ్, డెంగీ కేసులు నమోదైన రోగుల్లో ప్లేట్‌లెట్స్ తగ్గుతున్నాయి. దీన్ని ఆసరాగా తీసుకుని ప్రైవేటు ఆస్పత్రులు దందా సాగిస్తున్నాయి. అవసరం ఉన్నా లేకపోయినా రెండు నుంచి వారం రోజులపాటు రోగుల్ని ఆస్పత్రిలో చేర్చుకుని రూ.వేలకు వేలు వసూలు చేస్తున్నాయి. డెంగీ రోగికి ప్లేట్‌లెట్స్ ఎక్కించాల్సి వస్తే వెంటనే వైద్యులు హైదరాబాద్‌కు రిఫర్ చేస్తున్నారు. జిల్లాకు వైద్య కళాశాల వచ్చినా అన్నిరకాల ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నా సరైన పరికరాలు లేకపోవటంతో హైదరాబాద్‌కు రిఫర్ చేస్తున్నట్లు తెలుస్తోంది.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

అపరిశుభ్రతే కారణం

భారీవర్షాల కారణంగా పల్లెల్లో అపరిశుభ్రత రాజ్యమేలుతుంది. ఫలితంగా దోమలు పెరిగి వ్యాధులకు ప్రధాన కారణం అవుతున్నాయి. పల్లెల్లో 2 ఏళ్లుగా ప్రజాప్రతినిధులు లేకపోవటం, ప్రత్యేకాధికారులు అటుగా తొంగి చూడకపోవటంతో పల్లెలో అపరిశుభ్రత కారణంగా ప్రజలు మంచం పడుతున్నారు.

ప్లేట్‌లెట్స్ తగ్గటం మామూలే



వైరల్ ఫీవర్, టైఫాయిడ్, డెంగీ వచ్చి న వారిలో ప్లేట్‌లెట్స్ తగ్గడం మామూలే. ప్లేట్‌లెట్స్ తగ్గితే ఆందోళన అనవసరం. ఎవరైనా జిల్లా కేంద్ర ఆస్పత్రిలోనే వైద్య పరీక్షలు చేయించుకుని అక్కడే చికిత్సలు పొందవచ్చు. ప్లేట్‌లెట్స్ తగ్గాయని ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేరి అనవసరంగా అప్పులపాలు కావొద్దు.

- శ్రీరామ్, జిల్లా వైద్యాధికారి, మెదక్

సమాజానికి దిక్సూచి

- ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిది
- ఎమ్మెల్సీలు కొమరయ్య, అంజిరెడ్డి

మెదక్ కలెక్టరేట్: సమాజానికి ఉపాధ్యాయులు దిక్సూచులని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిద్దే బాధ్యత ఎనలేనిదని టీచర్స్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ చిన్న మైల్ అంజిరెడ్డి కొనియాడారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్య నేర్పే గురువులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదన్నారు. జాతీయ విద్యా విధానంతో విద్య బోధించాలని కోరారు. గురువులతోనే సమాజ అభివృద్ధి సాధ్యపడుతుందని వివరించారు.

బడిలోనే తొలి ప్రస్థానం..

రాష్ట్ర అధినేతకైనా దేశాధినేతకైన బడిలోనే తమ ప్రస్థానం మొదలవుతుందని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. విద్యారంగానికి సర్వేపల్లి రాధాకృష్ణన్ చేసిన కృషిని స్మరించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో కార్పొరేట్ తరహాలో పాఠశాలలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటుందని చెప్పారు. చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 58 మంది టీచర్లను శాలువా, ప్రశంసా పత్రాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఈఓ రాధా కిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఏఎంఓ సుదర్శన్ మూర్తి, సర్వ శిక్షా అభియన్ అధికారులు జ్యోతి, ఈశ్వరి, నవీన్, రాజు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీలు, కలెక్టర్, అధికారులు

ఆయిల్‌పామ్‌తో అధిక లాభం

- ఉద్యానశాఖ సంచాలకులు యాస్మిన్ బాషా
- చిన్నగొట్టిముక్లలో మెగా ఆయిల్ ప్లాంటేషన్

శివ్వంపేట(నర్సాపూర్): ఆయిల్‌పామ్ సాగు రైతులకు అన్ని విధాలుగా లాభదాయకమని, ఈ పంట సాగు చేసేందుకు ముందుకు రావాలని రాష్ట్ర ఉద్యానశాఖ సంచాలకులు యాస్మిన్ బాషా అన్నారు. శనివారం మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల గ్రామ పరిధిలో మాజీ ఐఏఎస్ అధికారి సింగాయిపల్లి నర్సింగరావు వ్యవసాయ పొలంలో ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ చేపట్టారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ రాహుల్‌రాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిమాండ్ ఉన్న పంటల సాగుపై రైతులు ఆసక్తి కనబరిస్తే స్థిర ఆదాయం ఉంటుందన్నారు. ఆయిల్‌పామ్ పంటకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందన్నారు. ఈ పంటకు అటవీ జంతువులు, దొంగల బెడద ఉండదని, ఉద్యానవన శాఖ సబ్సిడీపై మొక్కలు అందిస్తుందన్నారు. ఈ సాగులో అంతర్ పంటలు వేసుకోవచ్చని, పంట చేతికి వచ్చిన తర్వాత మధ్యవర్తుల ప్రమేయం లేకుండా సంబంధిత కంపనీ కొనుగోలు చేస్తుందన్నారు. అనంతరం జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ప్రతాప్‌సింగ్, జిల్లా వ్యవసాయ అధికారి దేవ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 2025–26 ఏడాదికి 2,500 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేసే విధంగా లక్ష్యం పెట్టుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో లివ్ పామ్ మేనేజింగ్ డైరెక్టర్ సాయి, ఆర్‌డీఓ మైపాల్‌రెడ్డి, తహసీల్దార్ కమలాద్రి, ఏఓ లావణ్య, ఆర్‌ఐ కిషన్, జిల్లా రైతు సమన్వయ సమితి గౌరవ అధ్యక్షుడు మైసయ్యయాదవ్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ ప్రారంభిస్తున్న యాస్మిన్‌బాషా, కలెక్టర్ రాహుల్‌రాజ్

వర్షాలతో రూ.13.05 కోట్ల నష్టం

కొత్తగా 25 ప్రత్యేక టవర్ల ఏర్పాటు

టీజీఎస్‌సీపీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ బాలస్వామి

మెదక్ కలెక్టరేట్: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో జిల్లా వ్యాప్తంగా రూ.13.5 కోట్ల నష్టం జరిగిందని టీజీఎస్‌సీపీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ బాలస్వామి అన్నారు. శనివారం మెదక్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్షాల కారణంగా 115 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయినట్లు చెప్పారు. 9 ఫీడర్లు దెబ్బతినగా ఏడింటిని సరిచేసినట్లు తెలిపారు. త్వరలో మిగతా వాటిని సరి చేయనున్నట్లు చెప్పారు. మెదక్ సర్కిల్ 460 డీటీఆర్‌లు ప్రభావితం కాగా.. 16 పూర్తిగా కొట్టుకుపోయాయని, 1,3,44 స్తంభాలు దెబ్బతిన్నట్లు వివరించారు. 24 గంటల్లోనే 259 స్తంభాలు, 14 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, 11 కిలోమీటర్ల మేర లైన్లు వేసినట్లు వివరించారు. మెదక్‌లో నీట మునిగిన పిల్లికొట్టాల్ సబ్‌స్టేషన్‌కు తాత్కాలికంగా రాజ్‌పల్లి సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. రెండుమూడు రోజుల్లో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. రాబోయే రోజుల్లో 25 ప్రత్యేక టవర్లను ఏర్పాటు చేయనున్నట్లు బాలస్వామి తెలిపారు. వర్షాలకు దెబ్బతిన్న సబ్‌స్టేషన్లు, నూతనంగా నిర్మించనున్న సబ్‌స్టేషన్లను పరిశీలించారు. ఈ సమావేశంలో మెదక్ ఎస్‌ఈ నారాయణ నాయక్, మెదక్, తూప్రాన్ డీఈలు చాంద్‌బాషా, గరుత్మంతరాజు, టెక్నికల్ డీఈ శ్రీనివాస్ విజయ్, ఏడీఈ మోహన్ బాబు, ఏఈ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సమీకృతం.. పూర్తయ్యేనా..!

సమీకృత భవన సముదాయానికి శిలాఫలకం వేసి నాలుగేళ్లు అయింది. ఇప్పటికీ పూర్తి స్థాయిలో నిర్మాణం పూర్తి కాలేదు. నిధుల కొరతతో కొనరు పనులు మిగిలిపోయాయి. తాజాగా కలెక్టర్ రూ.7.5 లక్షల సొంత నిధులు కేటాయించారు. దీంతో భవన నిర్మాణంపై మరోసారి ప్రజల్లో ఆశలు రేకెత్తుతున్నాయి.

- కొనరు పనులకు నిధుల ఆటంకం
- రెండేళ్లుగా నిలిచిన నిర్మాణం
- తాజాగా కలెక్టర్ చొరవతో రూ. 7.5 లక్షలు విడుదల

తూప్రాన్: ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు గత ప్రభుత్వం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే చోట ఉండాలని చర్యలు చేపట్టింది. ఇందుకోసం మూడేళ్ల క్రితం రూ. 8 కోట్ల నిధులతో మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సమీకృత భవన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టింది. సుమారు 30 వేల చదరపు అడుగుల స్థలంలో విశాలమైన భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అయితే మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ఐకేపీ, తహసీల్దార్, మండల వనరుల కేంద్రం భవనాలను కూల్చి వేసి సమీకృత భవన నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేశారు. ఏడాది వ్యవధిలో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ మూడేళ్లు గడుస్తున్నప్పటికీ పూర్తి కాలేదు. గతంలో గడా ప్రత్యేకాధికారిగా ఉన్న ముత్యంరెడ్డి పలుమార్లు సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కానీ అంతలోనే ఎన్నికల కోడ్ రావడం, ప్రభుత్వం మారడంతో పట్టించుకునే వారు కరువయ్యారు.

అద్దె భవనాల్లో అవస్థలు..

నిధుల విషయమై ఇటీవల అధికారులు కలెక్టర్ రాహుల్ రాజ్ దృష్టికి తీసుకెళ్లడంతో తన సొంత నిధుల నుంచి రూ. 7.5 లక్షలు విడుదల చేశారు. దీంతో విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మరో నెల రోజుల్లో పనులు పూర్తి కానున్నాయని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు. ఆ వెంటనే ఆర్డీఓ, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలను సమీకృత సముదాయంలోకి రానున్నాయి. మిగితా కార్యాలయాలు విడతల వారీగా అందుబాటులోకి రానున్నట్లు సమాచారం. కాగా డివిజన్ కేంద్రం ఏర్పడినప్పటికీ అద్దె భవనాలు, ఇరుకు గదుల్లో కార్యాలయాలు కొనసాగిస్తున్నారు. దీంతో ఆయా పనులపై వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



తూప్రాన్: నిర్మాణంలో ఉన్న సమీకృత భవన సముదాయం

నిధుల కొరతతోనే..

నిధుల కొరతతో పనుల్లో జాప్యం జరిగింది. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. ఆయన స్పందించి రూ.7.5 లక్షలు విడుదల చేశారు. ఈ నిధులతో కొంత మేర పనులు పూర్తి చేస్తాం. మొదటగా ఆర్డీఓ, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు అందుబాటులోకి తెస్తాం.

- ఎస్. మధుసూదన్, ఏఈ పంచాయతీరాజ్

ఇంకా ప్రారంభం కాని రైళ్లు

భారీ వర్షాలకు దెబ్బతిన్న శమ్నాపూర్ ట్రాక్


రామాయంపేట(మెదక్): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రామాయంపేట, హవేళీ ఘనపూర్ మండలాల్లో దెబ్బతిన్న రైల్వేట్రాక్, తెగిన రోడ్డు మరమ్మతులకు నోచుకోలేదు. దీనితో ఈమార్గంలో రైళ్ల రాకపోకలు నిలిచి 11 రోజులు కావొస్తుంది. దూర ప్రాంతాలకు వెళ్లే జిల్లా కేంద్రంలోని రైలు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఘణపూర్ మండలం శమ్నాపూర్‌వద్ద రెండు చోట్ల ట్రాక్ దెబ్బతిని పట్టాలు గాలిలో తేలాయి. శనివారం సంబంధిత శాఖ అధికారులు శమ్నాపూర్ వద్ద ట్రాక్ మరమ్మతు పనులు చేపట్టారు. భారీ వర్షాలకు రామాయంపేట మండలం లక్ష్మాపూర్ రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో తారు రోడ్డు తెగిపోయింది. అధికారులు స్పందించి తెగిన రోడ్డుకు మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కాలేజీకి డుమ్మా కుదరదిక

- ఇంటర్ విద్యార్థులకు ముఖ గుర్తింపు
- రోజుకు రెండుసార్లు ఎఫ్ఆర్ఎస్
- గైర్హాజరైతే తల్లిదండ్రులకు సమాచారం
- జిల్లాలో 62 కళాశాలలు, 13,123 మంది విద్యార్థులు

ఇంటర్మీడియెట్ స్థాయిలో ముఖ గుర్తింపు విధానం ప్రారంభమైంది. పాఠశాల స్థాయిలో విద్యార్థులతో పాటు సిబ్బందికి ఈ విధానం అమలు పరుస్తుండడంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. మొదట కొంతమంది టీచర్లు వ్యతిరేకించినప్పటికీ.. ఇటీవల ఎఫ్ఆర్ఎస్ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత హాజరుశాతం.. సమయపాలన.. ఖచ్చితంగా అమలవుతోంది. – మెదక్ అర్బన్

జిల్లాలో 16 ప్రభుత్వ, 36 గవర్నమెంట్ సెక్టార్, 10 ప్రైవేట్ జూనియర్ కళాశాలలు కలిపి మొత్తం 60 కళాశాలలు ఉన్నాయి. ఇంటర్ మొదటి సంవత్సరంలో 6,068, ద్వితీయ సంవత్సరంలో 7,055 కలిపి మొత్తం 13,123 మంది విద్యార్థులు చదువుతున్నారు. కళాశాలలు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతాయి. టీజీబీఐఈ ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్న తర్వాత, రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులకు లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ అందజేశారు. లెక్చరర్లు యాప్ ఓపెన్ చేయగానే ఉదయం బోధించే తరగతి, విద్యార్థుల వివరాలు కనిపిస్తాయి. విద్యార్థి పేరుపై క్లిక్ చేయగానే, కెమెరా ఓపెన్ అవుతుంది. వెంటనే విద్యార్థి ముఖంపై క్లిక్ చేయగానే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది.




పాపన్నపేట జూనియర్ కళాశాలలో ఎఫ్ఆర్ఎస్ విధానంలో అటెండెన్స్ తీసుకుంటున్న దృశ్యం

త్వరలో లెక్చరర్లకు..

ఇంటర్ విద్యార్థులకు రోజుకు రెండుసార్లు ఎఫ్ఆర్ఎస్ విధానంతో అటెండెన్స్ తీసుకుంటున్నారు. ముఖ గుర్తింపు హాజరు ద్వారా విద్యార్థి కళాశాలకు హాజరు కాకుంటే, వారి తల్లిదండ్రుల ఫోన్‌లకు మెసేజ్ వెళ్తుంది. ఈ హాజరును సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్, డీఐఈఓ, రాష్ట్ర అధికారులు సమీక్షిస్తున్నారు. అయితే విద్యార్థులకు ఎఫ్ఆర్ఎస్ విధానం అమల్లోకి వచ్చినా, లెక్చరర్లకు మాత్రం అమలు కావడం లేదు. గతంలో వారికి బయోమెట్రిక్ విధానం అమల్లో ఉండేది. ప్రస్తుతం అది పనిచేయడం లేదు. కాగా వీరికి కూడా త్వరలోనే ఎఫ్ఆర్ఎస్ అందుబాటులోకి వస్తుందని అధికారులు చెబుతున్నారు.

హాజరుశాతం పెరుగుతుంది



కళాశాలలో ఎఫ్ఆర్ఎస్ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత విద్యార్థుల అటెండెన్స్, సమయపాలన పెరిగింది. హాజరుశాతం పెంచడం ద్వారా విద్యార్థి నాణ్యమైన విద్య పొందుతాడు. పరీక్షల్లో మంచి ఫలితాలు వస్తాయి. చెడు తిరుగుళ్లకు ఆస్కారం ఉండదు. విద్యార్థులకు సంబంధించిన సమాచారం వారి తల్లిదండ్రులకు తెలుస్తుంది.

- నర్సింలు, ప్రిన్సిపాల్, పాపన్నపేట

క్లుప్తంగా

రేపు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల ముట్టడి

– మాల మహానాడు

చేర్యాల(సిద్దిపేట): రోస్టర్‌ విధానంలో మాలలకు అన్యాయం జరిగిందని, రోస్టర్‌ పాయింట్‌ తగ్గించి, జీఓ 99ని వెంటనే సవరించాలని డిమాండ్‌ చేస్తూ ఈ నెల 8న రాష్ట్ర వ్యాప్తంగా 119 మంది ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల ముట్టడికి పిలుపునిచ్చినట్లు మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాలల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తూ అణిచివేస్తున్న తీరు దురదృష్టకరమన్నారు. దళితుల మధ్య వర్గీకరణ చేసి తీరని అన్యాయం చేశారని, అలాగే జీఓ నం.99 తీసుకువచ్చి మాల విద్యార్థుల భవిష్యత్తు నాశనం చేశారని ఆరోపించారు. ముట్టడి కార్యక్రమానికి మాల సోదరులు అధిక సంఖ్యలో హాజరై జీఓ నం.99 ప్రతులు దగ్ధం చేయాలని పిలుపునిచ్చారు.

పాముకాటుతో వ్యక్తి మృతి


ఆగమయ్య

వెల్దుర్తి(తూప్రాన్‌): పాముకాటుతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని శేరీల గ్రామ శివారులో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పులి ఆగమయ్య(50) వ్యవసాయంతో పాటు పాల విక్రయం ద్వారా కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజూ మాదిరిగా తనకున్న గేదెలను గ్రామ శివారులోని ఓ వ్యవసాయ పొలం వద్దకు మేతకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో మంచినీరు తాగడానికి బోర్‌ మోటార్‌ వద్దకు వెళ్లగా విషసర్పం కాలికి కాటువేసింది. దీంతో నురగలు కక్కుతూ ఘటనా స్థలంలోనే పడిపోయాడు. గమనించిన చుట్టుపక్కల వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు వెల్దుర్తిలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య మల్లమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు.

వాహనం కడుగుతుండగా..

విద్యుదాఘాతంతో యువకుడు మృతి


ఏలూరి బన్నీ

మద్దూరు(హుస్నాబాద్‌): ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని గాగ్గిళ్లాపూర్‌ గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పుప్పాల బాలస్వామి గణేశ్‌ నిమజ్జనం కోసం తన ట్రాక్టర్‌ను కడిగేందుకు డ్రైవర్‌ ఏలూరి బన్నీ(21)ని తీసుకుని గ్రామ శివారులోని ఓ నీటి తొట్టి వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో ట్రాక్టర్‌ ట్రాలీ పైకి లేపి డ్రైవర్‌ నీటితో కడుగుతుండగా ప్రమాదవశాత్తు పైన ఉన్న విద్యుత్‌ తీగలు తగలడంతో షాక్‌కు గురై తీవ్ర గాయాలతో కిందపడ్డాడు. అదే సమయంలో కింద ఉండి ట్రాక్టర్‌ కడుగుతున్న బాలస్వామికి సైతం షాక్‌ తగిలింది. వెంటనే గమనించిన స్థానికులు ఇరువురిని చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా బన్నీ అప్పటికే మృతి చెందాడు. మృతదేహాన్ని హుస్నాబాద్‌ ఏసీపీ సదానందం, చేర్యాల సీఐ శ్రీను పరిశీలించారు.

అక్రమ మద్యం అమ్మిన వారిపై కేసు


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

నర్సాపూర్‌: నర్సాపూర్‌ ప్రొహిబిషన్‌ అండ్‌ ఎక్సైజ్‌ సర్కిల్‌ పరిధిలో శనివారం పోలీసులు తనిఖీలు చేపట్టి అక్రమంగా మద్యం అమ్మిన ముగ్గురిపై కేసులు నమోదు చేశారు. సీఐ గులాం ముస్తఫా కేసు వివరాలు వెల్లడించారు. శనివారం సర్కిల్‌ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం అమ్మిన వారిపై కేసులు నమోదు చేసి, వారి నుంచి 5.2లీటర్ల విస్కీ, 1.95 లీటర్ల బీర్లను స్వాధీనం చేసుకున్నారు. కాగా తూప్రాన్‌కు చెందిన రాముగౌడ్‌, నర్సాపూర్‌కు చెందిన రాజు, సీతారాంపూర్‌కు చెందిన ఆంజనేయులు అక్రమంగా మద్యం అమ్మారని, వీరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. తనిఖీల్లో ఎస్‌ఐలు రాఘవేందర్‌రావు, అరుణ, ఖాజా అజీజ్‌ అహ్మద్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఇచట చూడముచ్చట — చూసొద్దాం రండి!

కాకతీయులు ఏలిన సంగారెడ్డి

- విద్య, పర్యాటకం, ఆధ్యాత్మిక కేంద్రాలకు నెలవు
- మంజీరాలో వలస పక్షుల సందడి
- సెలయేళ్ల లాగ పారే పంట కాల్వలు
- రక్షణగా కనబడే ఎత్తైన హనుమాన్‌ విగ్రహం

కాకతీయులు ఏలిన గడ్డ సంగారెడ్డి. పట్టణం చుట్టూ మంజీరా పరవళ్లు, పచ్చని పంటపొలాలు గత చరిత్రకు ఆనవాళ్లుగా నిలిచే ఎత్తైన కోటలు. ఆధ్యాత్మికత ఉట్టిపడే పురాతన ఆలయాలు ఇలా ఇంకా.. మరెన్నో చూడదగిన ప్రదేశాలతో రాష్ట్ర రాజధానికి ఆనుకుని ఉన్న అద్భుతమైన పట్టణంపై ఈ వారం సండే సాక్షి కథనం.

– సంగారెడ్డి టౌన్‌


నాటి ఈశ్వరాపురం.. నేటి ఇస్మాయిల్‌ఖాన్‌ పేట

ఇస్మాయిల్‌ ఖాన్‌ పేటలో దుర్గా భవాని అమ్మవారు

ఈశ్వరపురం(ఇస్మాయిలా ఖాన్‌ పేట)లో కొలువైన భవానీ మాత ఆలయానికి వందల ఏళ్ల చరిత్ర ఉన్నది. సప్త ప్రాకారయుత ఆకారంలో ఉన్న ఈ ఆలయంలో అమ్మవారు ఏకశిల రూపంలో అష్టభుజిగా, సింహవాహినిగా 13 అడుగుల ఎత్తైన భారీ విగ్రహం రూపంలో భక్తులకు అమ్మవారు దర్శమిస్తుంది. ప్రతీ ఏటా శరన్నరాత్రులతో పాటు వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. వీటితోపాటు సంగారెడ్డిలో చూడదగిన ప్రదేశాలు ఫల పరిశోధన కేంద్రం, రాజంపేటలోని రాజేశ్వర ఆలయం, వాసవీ మాత దేవాలయం, పురాతన కోటలు, గడీలతో దర్శనమిస్తున్నాయి.

11వ శతాబ్దంలో పాపన్నపేట సంస్థానంగా ఉన్నప్పుడు రాణిశంకరాంబ , రాజా సదాశివారెడ్డి కుమారుడైన 'సంగ్గా పేరుపై సంగారెడ్డి పట్టణంగా ఏర్పడిందే ప్రస్తుత మన సంగారెడ్డి. తెలంగాణ రాష్ట్రంలో మెదక్‌ జిల్లా కేంద్రంగా ఉండగా... జిల్లాల పునర్విభజనలో సంగారెడ్డి జిల్లాగా అవతరించింది. జీహెచ్‌ఎంసీకి అనుకుని ఉన్న సంగారెడ్డికి హైదరాబాద్‌ నుంచి కొన్ని నిమిషాల వ్యవధిలో చేరుకునేందుకు రవాణా సౌకర్యం కూడా ఉన్నది. సుమారు లక్ష 60వేల జనాభా కలిగిన సంగారెడ్డిలో అన్ని రాష్ట్రాల ప్రజలు వ్యాపారాలు, ఉద్యోగాలు చేస్తూ ఇక్కడే జీవనం సాగిస్తున్నారు. సేఫ్‌ సిటీగా పేరు గాంచడంతో హైదరాబాద్‌లో ఉద్యోగాలు చేసే వారు సైతం ఇక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు.

కలియుగ దైవం వెంకటేశ్వరుడు


వైకుంఠపురం దేవాలయం

పట్టణానికి అతి సమీపంలో సంగారెడ్డి జోగిపేట ప్రధాన రహదారి పక్కనే ఆరు వందల ఏళ్ల నాటి కలియుగ దైవం వెంకటేశ్వరుడి శ్రీ వైకుంఠపురం ఆలయం ఉన్నది. తెలంగాణ తిరుపతిగా ప్రఖ్యాతి గాంచి నిత్యం వేల సంఖ్యలో భక్తులతో పూజలందుకుంటూ ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా అవతరించింది. ఇక్కడ వైకుంఠ ఏకాదశితో పాటు వార్షిక బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా జరుగుతాయి.

ఎత్తైన హనుమాన్‌


అతిపెద్ద హనుమంతుని విగ్రహం

చెరువుకట్టను ఆనుకుని ఉన్న అతి ఎత్తైన హనుమంతుడి విగ్రహం ప్రజలతో పాటు ఈ దారిగుండా వచ్చి పోయే ప్రయాణికులను ఆశీర్వదిస్తూ పట్టణానికి రక్షణగా ఉన్నట్లు కనిపిస్తుంది. అలాగే పక్కనే నవరత్నాల ఆలయం, సంతాన నాగేంద్రున్ని పుట్ట, మహబూబ్‌ సాగర్‌ చెరువు మినీ ట్యాంక్‌ బండ్‌ ప్రజలకు ఎంతో ఆహ్లాదాన్ని పంచుతాయి.

కలబ్‌గూర్‌ శివాలయం





కలబ్‌ గూర్‌ 11వ శతాబ్దంలో కాకతీయ రాజైన ప్రతాపరుద్రుడి ప్రధాన సేనాపతి శిష్యుడు ఒంటిమిట్ట ఓబలయ్య ఒకే చేతితో రాతితో నిర్మించిన శ్రీ కాశీ విశ్వేశ్వర ఆలయం ఎంతో మహిమాన్వితం గలది. ఆలయంలో ప్రధానంగా అనంత పద్మనాభస్వామి విగ్రహం, శివలింగం దర్శనమివ్వడం... సూర్య కిరణాలు దేవతామూర్తులపై పడటం మరో విశేషం. ఇక్కడి ఆలయం త్రికూట ఆకారంలో ఉండి, ఆలయం ముందు కోనేరు, ఒకే చోట శివుడు, అనంత పద్మనాభస్వామి, వేణుగోపాలస్వామి కొలువై ఉన్నారు. శివరాత్రితో పాటు పలు పర్వదినాల్లో భక్తులు వచ్చి విశేష పూజలు చేస్తారు. నందీశ్వరుడు, ధ్వజ స్తంభం స్వాగతం పలుకుతూ ఆలయ ఆవరణ అంతా వెయ్యి స్తంభాల గుడిని గుర్తుకుతెస్తాయి.

ఆహ్లాదం పంచుతున్న మంజీరా

సంగారెడ్డి కలబుగూర్‌ శివారులో ఉన్న మంజీరా డ్యాం పర్యాటకులను కట్టిపడేస్తుంది. జంట నగరాలకు అతి చేరువలో ఉండటంతో సెలవు దినాల్లో జిల్లా ప్రజలతో పాటు పర్యాటకులు వస్తుండటంతో పరిసరాలు రద్దీగా దర్శనమిస్తాయి. వివిధ రకాల పక్షులు, మొసళ్లు, హెరిటేజ్‌ పార్కు ఎంతో ఆకట్టుకుంటుంది. వలస పక్షులు సైతం ఎంతో కనువిందు కలిగిస్తున్నాయి. పచ్చని పంటలు, గల..గల పారే కాల్వలు జల సవ్వడులు చేస్తుండగా వాటిని చూస్తూ పర్యాటకులు ఆనందంగా గడుపుతారు.



కాకతీయుల నాటి శివాలయం



ఇది పట్టణంలోని సోమేశ్వర వాడలో ఉండగా కాకతీయుల కాలంలో నిర్మించినట్లు శాసనాలు ఉన్నాయి. ఆలయంతో పాటు పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు సైతం చెరువును తవ్వించారు. 50 అడుగుల లోతుతో గుండం తవ్వించి మెట్లు ఏర్పాటు చేశారు. 12వ శతాబ్దంలో నిర్మించారు. ఇటీవలే దానికి భక్తులు మరమ్మతులు చేయిచడంతో పూర్వ వైభవం వచ్చింది.

రైల్వే బ్రిడ్జికి మరమ్మతులు


బ్రిడ్జి నిర్మాణ పనులను చేపడుతున్న సిబ్బంది

హవేళిఘణాపూర్‌(మెదక్‌): మండల పరిధిలోని శమ్నాపూర్‌ శివారులో కొట్టుకుపోయిన బ్రిడ్జికి రైల్వే శాఖ అధికారులు మరమ్మతులు చేపడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో చెరువు తెగిపోయి భారీగా వరద రావడంతో రైల్వేకట్టను తిరిగి పునరుద్ధరించడంలో నిమగ్నమయ్యారు. రైల్వే బ్రిడ్జి కింద భారీగా వరద నీరు చేరడంతో పెద్ద గొయ్యి ఏర్పడి ఇరువైపులా మట్టి కొట్టుకుపోయింది. వరద శనివారం కూడా రావడంతో నీటికి అడ్డంగా ఇసుక నింపిన బస్తాలు వేసి పనులు చేపట్టారు. వీలైనంత త్వరగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు.


నీటిని అదుపు చేసేందుకు బస్తాలో మట్టిని నింపుతున్న సిబ్బంది

తాళం వేసిన ఇంట్లో భారీ చోరీ..

మూడు తులాల బంగారం, 20 తులాల వెండి చోరీ

పటాన్‌చెరు టౌన్‌: తాళం వేసిన ఇంట్లో బంగారు ఆభరణాలు, వెండిని అపహరించారు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధికి చెందిన లత శుక్రవారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి సంగారెడ్డికి వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చే చూసేసరికి తాళం వేసినట్టే ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బెడ్‌ రూమ్‌లో ఉన్న మూడు తులాల బంగారు గొలుసు, రెండు చేతి ఉంగరాలు, 20 తులాల వెండి ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నర్సాపూర్‌ రూరల్‌: చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. ఎస్సై లింగం వివరాల ప్రకారం... ఈనెల 3న నర్సాపూర్‌ పట్టణంలో కల్లు దుకాణం వద్ద గుర్తుతెలియని మహిళ(50) స్పృహ కోల్పోయి పడి ఉంది. అదే రోజు నర్సాపూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ఆస్పత్రికి తరలించాలని వైద్యులు సూచించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది.

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యమయ్యారు.


శ్రీను

తూప్రాన్‌: పట్టణంలో వ్యక్తి అదృశ్యమైన ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ శివానందం వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన బుడ్డ శ్రీను(35) భార్య హేమలత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఆర్థిక సమస్యలతో గత ఆరు నెలల క్రితం పిల్లలతో కలిసి భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఒంటరిగానే తల్లి సుశీల వద్ద ఉంటూ కూలీ పనులు చేసుకొని జీవిస్తున్నాడు. ఈ క్రమంలోనే ఈ నెల 3న ఇంట్లో నుంచి బ్యాంకుకు వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు.

గుండ్లపల్లిలో వ్యక్తి..


నాగరాజు

శివ్వంపేట(నర్సాపూర్‌): వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మండల పరిధిలోని గుండ్లపల్లిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి కథనం ప్రకారం... గ్రామానికి చెందిన ఉప్పునూతల నాగరాజు గత నెల 28న హైదరాబాద్‌లో పని చూసుకుంటానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఈ నెల 2న ఫోన్‌ లో మాట్లాడిన నాగరాజు అప్పటి నుంచి ఫోన్‌ స్విచ్‌ ఆఫ్‌ రావడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. దీంతో బంధువులు, స్నేహితుల ఇండ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

గంజాయి అమ్ముతున్న ఇద్దరి అరెస్టు

440 గ్రాముల గంజాయి స్వాధీనం

చేర్యాల(సిద్దిపేట): గంజాయి అమ్ముతున్న ఇద్దరని పోలీసులు అరెస్టు చేశారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ ఎల్‌.శ్రీను, ఎస్‌ఐ నవీన్‌తో కలిసి కేసు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని లక్ష్మీనర్సింహ స్వామి ఆలయం సమీపంలో ఇద్దరు వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్‌, పోలీసులు కలిసి రైడ్‌ చేశారు. ఈ దాడిలో బొడ్డు చందు, పొన్న బోయిన పవన్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 440 గ్రాముల గంజాయి, రెండు ఫోన్లు,పేపర్‌ బండిల్స్‌, స్పిరిట్‌ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. విచారించగా హైదరాబాద్‌లో గుర్తు తెలియని వ్యక్తి నుంచి కొనుగోలు చేసినట్లు చెప్పారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీను

భర్త వేధింపులతోనే..

- అదనపు కట్నానికి తోడు అనుమాన భూతం
- చిన్నారుల గొంతు నులిమి తాను ఆత్మహత్య
- డాగ్‌స్క్వాడ్‌, క్లూస్‌ టీం విచారణ
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ


భర్త సంగమేశ్‌తో మృతురాలు ప్రేమల

నారాయణఖేడ్‌: మద్యానికి బానిసై అదనపు కట్నం వేధింపులకు తోడు అనుమానం ఆ కుటుంబంలో పెనుభూతంలా మారింది. భర్త పెట్టే వేధింపులు భరించలేక ఇద్దరు పిల్లల గొంతు నులిమి, తాను ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై ఖేడ్‌ డీఎస్పీ వెంకట్‌రెడ్డి శనివారం వివరాలు వెల్లడించారు. నిజాంపేట్‌కు చెందిన బూషి సాయమ్మ, రాములు కుమార్తె ప్రేమల (22)ను నాలుగేళ్ల క్రితం దామర చెరువు గ్రామానికి చెందిన కొత్తపల్లి సంగమేశ్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. వివాహమైన అనంతరం అదనపు కట్నం కోసం తరచూ ప్రేమలను వేధింపులకు గురి చేసేవాడు. ఈ క్రమంలో మూడేళ్ల క్రితం ధనుష్‌, 45 రోజుల క్రితం మరో కుమారుడు జన్మించాడు. ఇటీవల బారసాల నిర్వహించి బాబుకు సూర్యవంశీ అని నామకరణం కూడా చేశారు. ఈనెల 1న ప్రేమలను అత్తవారింటికి పిల్లలతో సహా పంపించారు. గురువారం సంగమేశ్‌ తన భార్య ప్రేమల, ఇద్దరు పిల్లలను నిజాంపేట్‌లోని పుట్టింటికి తీసుకొచ్చి వదిలి వెళ్లాడు. శుక్రవారం ఉదయం ఆమె తల్లిదండ్రులు, సోదరుడు జైపాల్‌ పొలం పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ప్రేమల కుమారులు ధనుష్‌ (3), సూర్యవంశీ (45 రోజులు) ఊపిరి ఆడకుండా గొంతు నులిమి చంపి, తాను కూడా ఉరివేసుకుంది. పనులు ముగించుకొని కుటుంబ సభ్యులు సాయంత్రం ఇంటికి రాగా ప్రేమల, ఇద్దరు చిన్నారులు విగతజీవులుగా పడి ఉండటం గమనించారు. భర్త, ఆయన సంబంధీకులే హత్య చేసి ఉంటారని అనుమానించారు. ఘటన జరిగిన రాత్రి క్లూస్‌ టీం, డాగ్‌ స్క్వాడ్‌ను రప్పించి వివరాలు సేకరించారు. భర్త సంగమేష్‌ అదనపు కట్నం , అనుమానం వేధింపులే తన కూతురి మృతికి కారణమని తండ్రి బూసి రాములు పోలీసులు ఫిర్యాదు చేశాడు. మృతదేహాలకు ఖేడ్‌ ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.


తనువు చాలించిన ప్రేమల, చిన్నారులు

రోడ్డు దాటుతుండగా ట్రావెల్‌ బస్సు ఢీ..

పటాన్‌చెరు టౌన్‌: యువకుడు రోడ్డు దాటుతుండగా ప్రమాదానికి గురై మృతి చెందాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... ఇస్నాపూర్‌ మున్సిపాలిటీకి చెందిన ప్రవీణ్‌ (22) శుక్రవారం రాత్రి గణేశ్‌ విగ్రహాల ఊరేగింపు చూసి వస్తానని ఇంటి నుంచి వెళ్లాడు. అర్ధరాత్రి రోడ్డు దాటుతుండగా పటాన్‌చెరు వైపు నుంచి సంగారెడ్డికి వెళ్తున్న ట్రావెల్‌ బస్సు ప్రవీణ్‌ని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, పోలీసులు కేసు నమోదు చేశారు.

హైహై వినాయక

లీడర్‌గా ఎదిగేందుకు మండపాలే వేదికలు

- అనుకూలంగా మలుచుకుంటున్న యువ నేతలు
- కొత్త ఓటర్లకు దగరయ్యేందుకు వెరైటీ ప్రచారం

పటాన్‌చెరు: పటాన్‌చెరులో గ్రామాలు లేవు. పంచాయతీ ఎన్నికలు లేవు. చాలా గ్రామాలు మున్సిపాలిటీలుగా మారాయి. కొత్తగా వచ్చిన జనాలతో కాలనీలు పెరిగాయి.. ఓటర్లు పెరిగారు. ఆ ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు వినాయక ఉత్సవాలను వేదికలుగా చేసుకుంటూ నయాతరం నేతలు చేస్తున్న హడావిడి అంతా ఇంతా కాదు. మారుతున్న రాజకీయ పరిణామాలకు ఈ వినాయక ఉత్సవాలు వేదికలుగా మారుతున్నాయి. భక్తులకు, మండప నిర్వాహకులకు, కాలనీ సంఘాల వారికి దగ్గరయ్యేందుకు యువనేతలు చేస్తున్న ప్రయత్నాలు నయా ట్రెండ్‌గా మారాయి. వినాయక ఉత్సవాల నిర్వహణకు యువజన సంఘాలు, కాలనీ సంఘాలు రాజకీయవేత్తల సహకారాన్ని కోరడం సహజం. అయితే ఈ ఏడాది వినాయక ఉత్సవాల్లో మాత్రం కొందరు నాయకులు ప్రజల దృష్టిలో పడేందుకు చేస్తున్న ప్రయత్నాలు వెరైటీగా ఉన్నాయి. మండపాల సందర్శనను చిన్న వీడియోల రూపంలో పెట్టి వాటిని వైరల్‌ చేస్తున్నారు.



ఓటర్‌కు దగ్గరయ్యేందుకు..

- పటాన్‌చెరుకు చెందిన ఓ మాజీ సర్పంచ్‌ కుమారుడు రాజకీయ అరంగేట్రం చేస్తున్నారు. కార్పొరేటర్‌ కావాలనేది ఆయన కల. ఆయన ప్రత్యేకంగా మట్టి వినాయకులను ఇళ్ల వద్దకే పంపించారు. వెరైటీగా ఆయన ప్రచారానికి పర్యావరణ పరిరక్షణ ట్యాగ్‌ పెట్టి ప్రజల్లో మట్టి వినాయకులపై అవగాహన కల్పించేలా కలరింగ్‌ ఇచ్చారు. చేసేది మంచి పనే కావడంతో ప్రజలు బాగా స్పందించారు.
- అమీన్‌పూర్‌లో బీజేపీ నేత ఒకరు హిందూ బంధువులకు వినాయకులను అందిస్తానంటూ ప్రత్యేకంగా ఓ శిబిరాన్ని నిర్వహించి గణేశుడి ప్రతిమలు పంపిణీ చేశారు. అమీన్‌పూర్‌కు చెందిన ఓ బీజేపీ నేత తన నియోజకవర్గంలోని ప్రతి ప్రధాన కూడలిలో వినాయక పండుగ శుభాకాంక్షలు చెబుతూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. పటాన్‌చెరు పట్టణంలో మండల ఆఫీసు ముందు, బస్టాండ్‌ ఎదురుగా అన్ని ఫ్లెక్సీలే. దాదాపు అందరూ కొత్త ముఖాలే. ఇక అమీన్‌పూర్‌లో మాజీ కౌన్సిలర్లు, యువ నాయకులు మండపాలను సందర్శిస్తూ హడావిడి చేస్తున్నారు. అన్నదానాలకు, మండప నిర్వహణకు ఆర్థిక సాయం చేస్తూ ఆ నేతలు ఆయా కాలనీ సంఘాల వారిని మచ్చిక చేసుకుంటున్నారు.
- రామచంద్రాపురంలో ఓ మాజీ జడ్పీటీసీ కుమారుడు, అమీన్‌పూర్‌లో ఓ టీఆర్‌ఎస్‌ యువ నాయకుడు ప్రజలకు దగ్గరయ్యేందుకు ఉత్సవ కమిటీలకు సాయం చేస్తూ ప్రజల్లో గుర్తింపు తెచ్చుకునే పనిలో పడ్డారు. ఇదిలా ఉండగా పటాన్‌చెరు బడా నేతలకు జిల్లా వ్యాప్తంగా వినాయక ఉత్సవ కమిటీలకు ఉదారంగా విరాళాలు ఇచ్చే ఆనవాయితీ ఈ ఏడాది కూడా కొనసాగింది.